క్లుప్తంగా

ఎట్టకేలకు హ్యాండ్‌బుక్‌ల సరఫరా


వాహనంలోకి పుస్తకాలను లోడ్ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: జిల్లాలోని పాఠశాలల ఉపాధ్యాయులకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌లు ఎట్టకేలకు సరఫరా అవుతున్నాయి. శుక్రవారం నుంచి వీటిని పాఠశాలలకు పంపించే చర్యలను సమగ్ర శిక్ష అధికారులు చేపట్టారు. పాఠశాలలకు చేరని ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్‌ల పేరిట రెండు రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో ఏపీసీ శశిభూషణ్ స్పందించారు. వీటిని వాహనాల్లో సిద్ధం చేసి మండలాలకు పంపించారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం


రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ అనిత

జి.సిగడాం : గ్రామాల్లో డెంగీ, మలేరియా వంటి అంటురోగాలు ప్రబలకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని డీఎంహెచ్ఓ కె.అనిత వైద్యసిబ్బందికి సూచించారు. శుక్రవారం జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో పని చేస్తున్న ఏఎన్ఎంలు, ఎంఎల్ఎహెచ్‌పీలు సమన్వయంతో సేవలు అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉద్యోగావకాశాలు


రీజనల్ మేనేజర్‌ను సన్మానిస్తున్న నైరా కాలేజీ అధ్యాపకులు

శ్రీకాకుళం రూరల్: ప్రణాళికబద్ధంగా చదివితే బ్యాంకింగ్ రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ పి.రాజా అన్నారు. మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాల్లో శుక్రవారం అసోసియేట్ డీన్ డాక్టర్ జి.జోగినాయుడు ఆధ్వర్యంలో బ్యాంకింగ్ రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అవకాశాలను వివరించారు. తాను ఈ కళాశాలలోనే చదువుకున్నానని, ఈస్థాయికి రావడానికి నైరా కళాశాల ఎంతగానో దోహదపడిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.గురుమూర్తి, డాక్టర్ ఎస్.గోవిందరావు, వి.శ్రీనివాసరావు, ఉపేంద్రరావు, డి.చిన్నంనాయుడు, కె.గురువారెడ్డి, పి.సీతారామ్, పి.వెంకటరావు, పీడీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథ ప్రదర్శన


హరికథా భాగవతార్ షణ్ముఖిని సత్కరిస్తున్న సుమిత్రా సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో పులఖండం శ్రీనివాసరావు స్మారకంగా హరికథా నవరత్నాలు ప్రదర్శనలు శుక్రవారం కూడా కొనసాగాయి. తిరుపతికి చెందిన సీహెచ్ షణ్ముఖీ భాగవతారిణి ని 'మహిషాసుర మర్దని' కథను చక్కగా వినిపించారు. ముందుగా సుడా ఎస్ఈ పాగిరి సుగుణాకరరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న హరికథకు, కథకులకు చేయూతనిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, కిల్లాన ఫల్గుణరావు, బంకుపల్లి రమేష్ శర్మ, కొంక్యాన మురళీధర్, వి.వి.ఆర్.మూర్తి, ఎం.రాజు, టి.నీరజ, ఎం.వరలక్ష్మీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎదుటే కార్యకర్తల బాహాబాహీ

శ్రీకాకుళం: శ్రీకాకుళం శాసన సభ్యుడు గొండు శంకర్ ఎదుట ఇలిసిపురానికి చెందిన ఇద్దరు కార్యకర్తలు బాహాబాహీకి దిగడం చర్చనీయాంశమైంది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గండేపల్లి కోటేశ్వరరావు వార్డు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన స్థానంలో బి.మధును నియమించాలని ఎమ్మెల్యే యోచిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో కోటేశ్వరరావు, మధు మధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీరిద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని యోచించి కార్యాలయానికి పిలిపించారు. ఇద్దరితో మాట్లాడుతుండగా మరోసారి బాహాబాహీకి దిగడంతో భద్రతా సిబ్బంది అందరినీ బయటికి పంపించారు.

ఎరువూ కరువే..!


జి.సిగడాంలో ఇటీవల ఎరువుల కోసం క్యూలో ఉన్న రైతులు


ఎండలో ఉండలేక చెప్పులను క్యూలో పెట్టిన రైతులు

- కూటమి పాలనలో రైతులకు తప్పని ఇక్కట్లు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పూర్తిస్థాయిలో చేరని ఎరువులు
- రైతు సేవా కేంద్రాల్లో బారులు తీరుతున్న అన్నదాతలు

జి.సిగడాం: కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా ఇంతవరకు పూర్తిస్థాయిలో ఎరువులు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం రైతు సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఓవైపు ఎండ, మరోవైపు గంటల కొద్దీ నిరీక్షణ సహించలేక సొమ్మసిల్లిపోతున్నారు. జి.సిగడాం మండలంలో 21 రైతు సేవా కేంద్రాల పరిధిలో 42 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 9,800 వందల మంది రైతులు ఉన్నారు. 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో సుమారు 6వేల ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్నారు. యూరియా కోసం జి.సిగడాం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్దకు ఈ నెల 10న ఉదయం 7 గంటలకే పెద్ద ఎత్తున రైతులు చేరుకున్నారు. గంటల తరబడి క్యూలో ఉండలేక చెప్పులు క్యూలో పెట్టుకున్నారు.

కూటమి పాలనలో అన్నీ కష్టాలే..

కూటమి పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పథకం అమలు కాక పంట పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఎరువులు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతు ఇంటి ముంగిటకే సకాలంలో ఎరువుల, విత్తనాలు ఇచ్చేవారని, ఇప్పుడు అన్నదాతలను పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు.

ఉదయమే వచ్చినా..



బస్తా యూరియా కోసం ఉదయం 7 గంటల నుంచి రైతుసేవా కేంద్రం వద్ద పడిగాపులు కాశాం. ఎండలో ఉండలేక చెప్పులను క్యూలో ఉంచాం. చివరికి ఒక బస్తా మాత్రమే యూరియా ఇచ్చారు. ఇదే కూటమి పాలనకు నిదర్శనం.

– తొండ్రోతు సత్తిబాబు, రైతు, జి.సిగడాం

ఇలాగైతే కష్టమే..



ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, వరినారు కోసం యూరియా అవసరం. బస్తా ఎరువు కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. సకాలంలో రైతులకు ఎరువులు ఇవ్వని ప్రభుత్వం ఎందుకు? ఇలాగైతే సాగు చేయడం కష్టమే.

– పెద్దలెంక లక్ష్మి, జి.సిగడాం

ఆందోళన వద్దు..



జి.సిగడాం మండలంలో రైతు సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, పీఏసీఎస్ ద్వారా 200 వంద మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు ఇచ్చాం. 80 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి వచ్చింది. మరో వారం రోజుల్లో 100 మెట్రిక్ టన్నుల ఎరువుల తీసుకువస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.

– బెండి బాబ్జీ, మండల వ్యవసాయాధికారి, జి.సిగడాం

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీల ధర్నా


ర్యాలీ నిర్వహిస్తున్న హమాలీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీల యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ అండ్‌బీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి అనంతరం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, కోశాధికారి అల్లు సత్యనారాయణ హాజరై కార్మికుల పోరాటానికి మద్దతు తెలియజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు నిడిగంట్ల రమణ, గజినీ శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, సొంట్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 115 మంది ఎంపిక

ఎచ్చెర్ల : చిలకపాలేంలోని గణేష్ ఐటీఐ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 180 మంది అభ్యర్థులు హాజరుకాగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 115 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి.గజపతిరావు తెలిపారు. పట్టుదలతో చదివితే ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ టి.రాజు, కరస్పాండెంట్ ముద్దాడ రజినీ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం


సాయం అందిస్తున్న విజయకుమార్

శ్రీకాకుళం కల్చరల్ : ఆపదలో ఉండేవారికి చేయూతనిద్దామని ఈశ్వర్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు మార్పు విజయకుమార్ అన్నారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో పేద కుటుంబానికి చెందిన నాగరాజు, మీనా దంపతుల కుమారుడు శ్యాంచరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సందర్భంగా వైద్యఖర్చుల కోసం శుక్రవారం రూ.లక్షా 50 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు ఉర్లం శివతేజ పాల్గొన్నారు.

జనాభాకు తగిన మౌలిక వసతులు అవసరం


మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం, మేరా యూత్ భారత్, జాతీయ సేవా పథకం-1 ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో సుధ మాట్లాడుతు ప్రపంచంలో జనాభా కొన్ని దేశాల్లో పెరుగుతుండగా.. మరికొన్ని దేశాల్లో తగ్గుతుండంతో అక్కడ ప్రోత్సాహకాలను పెంచుతున్నారని చెప్పారు. మేరా యూత్ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.ఉజ్వల్ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలన్నారు. అనంతరం 2025 పీజీసెట్‌లో కళాశాల నుంచి 26, 37 ర్యాంకులు పొందిన ప్రేమ్‌కుమార్, యశ్వంత్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు సీహెచ్ రామమూర్తి, ఎం.వి.సత్యనారాయణ, రాజశేఖర్, వి.వెంకటరావు, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాస్ పాత్రో, కె.వాసుదేవరావు, పి.వెంకటరమణ, ఆర్.రవిశంకర్, చంద్రభూషణ్, వరలక్ష్మి, రామకృష్ణ, అరుణకుమారి, సూరిబాబు మణికుమార్, చిన్నారావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అన్నీ కష్టాలే


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం : కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు బూటకపు మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన అర్జునవలస పంచాయతీ శ్రేణులతో కార్యకర్తే కీలకం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయందోళనలకు గురి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో ప్రజలందరూ నిరాశ, నిస్పృహకు లోనై కాలం గడుపుతున్నారని, రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం ఆనందంగా లేదని చెప్పారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్జునవలస సర్పంచ్ మీసాల లక్ష్మీరామునాయుడు, ఉప సర్పంచ్ రామిశెట్టి మహేష్, నాయకులు కొత్తకోట ఉత్తరకుమార్, సిరిపురపు శ్రీరామ్, శ్రీరామ్, కోట్ల అప్పలనాయుడు, నౌకట్ల భీముడు, కాట తవుడు, గిరడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు ప్రాచీన, ఆధునిక వైభవాలపై పుస్తకం


సమావేశంలో మాట్లాడుతున్న ఇంటాక్ కన్వీనర్ సన్యాసిరావు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జిల్లా చారిత్రక, కళారంగ, పర్యాటక వైభవాన్ని ఆధునిక అభివృద్ధిని తెలియజేస్తూ సిక్కోలు వైభవం పేరుతో పుస్తక రచనకు ప్రయత్నాలు ప్రారంభించామని ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు తెలిపారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో పలువురు రచయితలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఆవిర్భావం చెంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా విశిష్టతలతో పుస్తకాన్ని రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. పలు రంగాలకు చెందిన రచయితలు ఈ నెలాఖరులోగా వ్యాసాలు పంపాలని కోరారు. పుస్తక ముద్రణ విషయమై కలెక్టర్ అనుమతి కోసం త్వరలో సంప్రదించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఇంటాక్ సభ్యులుగా గుర్తిస్తూ న్యూఢిల్లీ నుంచి అందిన పత్రాలను తర్లాడ అప్పలనాయుడుకు అందజేశారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, చింతాడ కృష్ణమోహన్, రచయితలు వాండ్రంగి కొండలరావు, లలితా రెడ్డి, కె.శ్రీనివాసరావు, బెందాళం వరలక్ష్మీ, ఆచార్య నిక్కు అప్పన్న, ఎల్.శ్రీనివాసరావు, సనపల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జనాభా దినోత్సవ ర్యాలీ


జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: కుటుంబ నియంత్రణ పట్ల ప్రజల్లో మరింత అవగాహన అవసరం రావాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పలు ప్రైవేటు నర్సింగ్ కళాశాల విద్యార్థుల నినాదాలతో ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, మాస్ మీడియా అధికారి (డెమో) వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త మంత్రి వెంకటస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆ నిధులు ఏమయ్యాయి?

జనాభా దినోత్సవాల సమయంలో ప్రభుత్వం కేటాయించిన నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.లక్ష వరకు నిధులను కేటాయించినా డెమో విభాగం అందుకు తగ్గ ఖర్చు చేయలేదని, కనీసం కరపత్రాలు పంపిణీ చేయలేదని సమాచారం.

మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికుల నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు మాట్లాడుతూ నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న ఆఫీస్ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి, పంప్ ఆపరేటర్లకు, ఎలక్ట్రీషియన్లకు ఇతర ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనా విభాగం అధికారి జి.ఎ.సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె.గురుమూర్తి, పార్థసారథి, గణేష్, మనీ, రసూల్, కళ్యాణి తిరుమలరావు, అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

దోమలు నివారణకు చర్యలు


మందును పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలు, ఖాళీ స్థలాల్లో నీరుచేరిపోయి దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ పి.సుధీర్ కుమార్ స్పందించి దోమల నిర్మూలనకు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో దోమల నివారణ మందును స్ప్రే చేయించారు.

డ్రమ్ సీడర్‌తో మేలు

శ్రీకాకుళం రూరల్: డ్రమ్ సీడర్ విధానంతో వరి నాట్లు వేయడం రైతులకు సులభతరమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. పరదేశిపాలెంలో శుక్రవారం డ్రమ్ సీడర్ విధానంతో వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. దీని ద్వారా కూలీల సమస్య తీరడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త ఎస్.సూర్యనారాయణ, రామ్మోహన్ రావు, రైతులు పాల్గొన్నారు.

'ఏఐ'లో శిక్షణ.. నైపుణ్యాలపై అవగాహన


హ్యాకథాన్-2025 వర్క్‌షాపులో పాల్గొన్న కళాశాలఅధ్యాపకులు, అతిథులు, విద్యార్థులు

- ఉమెన్స్ కాలేజీలో ముగిసిన 'హ్యాకథాన్- 2025'
- మూడు రోజులపాటు కంప్యూటర్ సైన్స్ విభాగంలో శిక్షణ
- విజేతలకు బహుమతులు అందజేత


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్-2025 తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థినులు చెబుతున్నారు. ఎడ్యు టెక్ సంస్థ సహకారంతో కళాశాల కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల నిర్వహించిన 'హ్యాకథాన్' వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. స్పెజీ సొల్యూషన్స్ నుంచి వచ్చిన నిపుణులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వివరించారు. వెబ్ డెవలప్‌మెంట్, జెనరేటివ్ ఏఐ టూల్స్‌పై విద్యార్థులకు హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్ అందజేశారు.

వివిధ కళాశాలల నుంచి హాజరై..

ప్రతిష్టాత్మక వర్క్‌షాప్‌లో ఆతిథ్య కళాశాలతోపాటు వివిధ కాలేజీల నుంచి 270 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి రెండు రోజులు విద్యార్థులకు వెబ్ డెవలప్‌మెంట్ టెక్నాలజీలు, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, జెనరేటివ్ ఏఐపై శిక్షణ ఇవ్వడంతో పాటు లింక్డ్ ఇన్ ప్రొఫైల్ ఆప్టిమైజేషన్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులతోనే నేరుగా ప్రాక్టీస్ చేయించి వారిలో నూతనోత్సాహాన్ని నింపారు. ఆఖ రోజున విద్యార్థులను జట్లుగా విభజించి.. హ్యాకథాన్ కోడింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది..



హ్యాకథాన్ వర్క్‌షాప్‌లో పాల్గనడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. మ కళాశాలలో ఇలాంటి వర్క్‌షాప్‌లు తరచుగా జరుగుతుండటం మా అదృష్టం.

– జి.గంగోత్రి, బీకాం కంప్యూటర్స్

సాంకేతికతను పెంపొందించుకోవాలి..

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక యుగంలో విద్యార్థులు అధునాతన సాంకేతికతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రగశాల క్లౌడ్ సొల్యూషన్స్ సీఈఓ యోగేంద్ర మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ముందుగానే గుర్తించగలిగితే వారిని ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చని అభిప్రాయపడ్డారు. డిజిటల్ యుగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఎస్.పద్మావతి. అకడమిక్ కో-ఆర్డినేటర్ ఓ.మౌనిక, కంట్రోలర్ ఆఫ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, డాక్టర్ ఎస్.వాణికుమారి, జేకేసీ కో-ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత, ఎస్.పూర్ణిమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐపై అవగాహన..



హ్యాకథాన్-2025 వర్క్‌షాప్ ద్వారా మాకు ఇప్పటి వరకు తెలియని అంశాలు తెలియజేశారు. ఏఐ వంటి కొత్త టెక్నాలజీపై అవగాహన పెరిగింది. సొంతంగా వెబ్‌సైట్‌లను రూపొందించగలిగాం.

– కె.యమున, ఎమ్మెస్సీ కంప్యూటర్స్

తెలుసుకున్నాం..



వెబ్ డెవలప్‌మెంట్‌లో ఏఐ టూల్స్ ఉపయోగించటం ద్వారా డిజైన్, డీబగ్గింగ్, కోడ్ జనరేషన్ పనులు వేగంగా పూర్తవుతాయి. వీటి వల్ల సమయం ఆదా అవుతుంది. వర్క్‌షాప్ ద్వారా అనేక అంశాలను తెలుసుకున్నాం.

– కె.నాగజ్యోతి, బీఎస్సీ కంప్యూటర్స్

చెరువు పరిశీలన


చెరువును పరిశీలించిన అధికారులు

శ్రీకాకుళం రూరల్: చెరువు విషయంలో గొడవలకు దిగకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని అధికారులు గ్రామస్తులకు సూచించారు. అంపోలు గ్రామ పంచాయతీ రెవెన్యూ పరిధి, శ్రీకాకుళం సరిహద్దు ప్రాంతాలైన సానివాడ గ్రామానికి చెందిన బరాటం చెరువును డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.లోకేష్, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ సంధ్యారాణి శుక్రవారం పరిశీలించారు. ఉపాధి పనుల నిమిత్తం కొన్ని నెలల క్రితం గ్రీవెన్స్‌లో చెరువుపై కొందరు అభ్యంతరాలు తెలియజేశారు. దీంతో గార మండల అధికారులతో పాటు రూరల్ మండల అధికారులు కలిసి చెరువులో కొలతలు వేశారు. 19 ఎకరాలు 5 సెంట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో కొంతమంది రైతులకు 1973లో 5 ఎకరాలు 70 సెంట్లు డి పట్టాను ఇచ్చారని, ఇప్పటికీ భూమిని సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలను సానివాడ సచివాలయంలో పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ భూములకు సంబంధించి సాగు నీటిని కాలువ(ఛానల్) పనులకు దిగువ పంటలు పండించేందుకు వాడుకోవచ్చని, భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం రూరల్ ఎస్ఐ రాము మాట్లాడుతూ సమస్య సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు, బెదిరింపులకు పాల్పడితే ఇరువర్గాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం: 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083

ఎచ్చెర్ల: 9951602849

Office mail : sklmadvt@gmail.com